# పీహెచ్‌సీలో పడకేసిన పారిశుధ్యం



అపరిశుభ్రంగా ఉన్న పీహెచ్‌సీ ప్రాంతం



పీహెచ్‌సీ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు



స్టోర్ రూం దగ్గర కాల్చిన మందులు, సిరంజిలు



పీహెచ్‌సీకి పేరు లేకుండానే ఉన్న కమాన్ బోర్డు

- పేరుకుపోయిన పిచ్చి మొక్కలు
- నాడు చిత్తశుద్ధితో శుభ్రం.. నేడు లోపించిన శుభ్రత
- పీహెచ్‌సీ పేరు లేకుండానే కమాన్‌బోర్డు

శివ్వంపేట, డిసెంబర్ 19: అపరిశుభ్రతకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దవాఖానలో చుట్టూ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. శివ్వంపేట మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఈ నెల 5న డీపీహెచ్ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్) ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌నాయక్, డీఎంహెచ్‌వో శ్రీరాంలు ప్రభుత్వ దవాఖానను సందర్శించి, దవాఖాన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు వచ్చి పది రోజులు దాటినా పిచ్చి మొక్కలు తొలిగించలేదు. దవాఖానలోని మందుల స్టోర్ రూం ఎదేటే ఉపయోగించిన మందులు, సిరంజిలను కాల్చివేసి, ఆ చెత్తను కూడా తొలిగించలేదు. దవాఖాన చుట్టూ ఉండే కాలనీ వారు ఏకంగా దవాఖాన ప్రహరీలో చెత్త వేస్తుండడంతో చెత్త డంపుగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిత్తశుద్ధితో ప్రభుత్వ దవాఖానలో పారిశుధ్యాన్ని పాటించేవారు. చుట్టూ పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలిగిస్తూ, దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచేవారు. ప్రస్తుతం పట్టించుకునేవారు నాథుడు కరువయ్యాడు. దవాఖానకు సంబంధించిన గేటు వద్ద కమాన్ బోర్డు ఉన్నప్పటికీ దానిపై పేరు కూడా లేదు.



కేసీఆర్ హయాంలో దవాఖాన వెనక భాగంలో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

### శుభ్ర చేయాలని పంచాయతీ సెక్రెటరీకి చెప్పాం



పీహెచ్‌సీలో పిచ్చి మొక్కలు పెరిగాయని, వాటిని శుభ్రం చేయించాలని పంచాయతీ సెక్రెటరీకి సూచించాం. వారు పూర్తి స్థాయిలో శుభ్రం చేయడం లేదు. కొందరు స్థానికులు దవాఖాన ప్రహరీ లోపలికి చెత్త వేస్తున్నారు. అలా చెత్తవేయకుండా చూడాలని చెప్పాం. త్వరలోనే దవాఖాన చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను పూర్తి స్థాయిలో తొలిగిస్తాం. దవాఖాన కమాన్‌కు బోర్డు సైతం ఏర్పాటు చేస్తాం. - డాక్టర్ సాయిసౌమ్య, మండల వైద్యాధికారిణి

## కేటీఆర్, హరీశ్‌రావులను ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

### బీఆర్ఎస్ మెదక్ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు



మెదక్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కేటీఆర్, హరీశ్‌రావులను ఎదుర్కోలేకనే కాం గ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవడానికి అక్రమంగా కేసులు పెడుతున్నదని బీఆర్ఎస్ పార్టీ మెదక్ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయు లు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రానికి లాభాలు తీసుకొచ్చిన ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌పై అక్రమంగా కేసులు వేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అడగకుండా నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అక్రమ కేసులు వేసి వేధిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## కేటీఆర్‌పై కేసు నమోదును ఖండిస్తున్నాం



చిన్నశంకరంపేట, డిసెంబర్ 19: ఫార్ములా ఈ కార్ రేస్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు ఖండించారు. చిన్నశంరంపేటలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితమైన రాజకీయాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

## నేషనల్ బాలరంగ్‌కు పాపన్నపేట విద్యార్థులు



బాలరంగ్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి వెళ్లిన పాపన్నపేట విద్యార్థులు

పాపన్నపేట, డిసెంబర్ 19: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్న నేషనల్ బాలరంగ్ ఫెస్టివల్‌కు పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలివెళ్లారు. గురువారం ఉపాధ్యాయులు ఆంజాగౌడ్, కృష్ణకాంత్, ఇందిరా ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులు మధ్యప్రదేశ్‌కు బయలుదేరారు. తెలంగాణలోని 33 జిల్లాల పాఠశాలల నుంచి కేవలం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎంపికైందని ఉపాధ్యయులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి టోర్నీకి మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సాపూర్, డిసెంబర్ 19: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జక్కపల్లి సమీపంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫర్హానా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో ఈ నెల 18న జిల్లా స్థాయి ఖోఖో టోర్నీ నిర్వహించారన్నారు. ఈ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీకి దివ్య, ప్రసన్న, బిందుప్రియ, భవ్య, వర్షిత, శ్రీజ, స్పందన, ప్రణతి, సాహిత, అక్షిత, రమ్య, సుప్రియ ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్, పీడీ అశోక్, టీచర్లు అభినందించారు.

## ‘సమగ్ర శిక్షా’తో విద్యావ్యవస్థ బలోపేతం



సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న ప్రసన్న హరికృష్ణ

మెదక్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): విద్యా వ్యవస్థ బలోపేతానికి సమగ్ర శిక్షా ఉద్యోగస్తులు కీలక పాత్ర పోషించారని మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ తెలిపారు. పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఆ ఉద్యోగులకు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో స్పష్టమైన నోటిఫికేషన్‌తో సమగ్ర శిక్షా ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ జరిగిందన్నారు. వారిని రెగ్యులరైజ్ చేస్తూ కనీస వేతనం, ఆరోగ్య, జీవిత బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెటర్నిటీ సెలవులకు సంబంధించి డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

## నేడు చెస్, యోగా పోటీలు



బహుమతులు అందజేస్తున్న జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు

మెదక్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మెదక్ స్టేడియంలో పురుషులు, మహిళలకు చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు శుక్రవారం తెలిపారు. గురువారం నాలుగో రోజు బాలురు, బాలికల విభాగంలో అథ్లెటిక్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రెండు క్రీడల్లో మొత్తం 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అథ్లెటిక్స్‌లో 23 మంది బాలురు, 23 మంది బాలికలు, షటిల్ బ్యాడ్మింటన్‌లో 8 మంది బాలురు, 8 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గెలుపొందిన వారికి ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి దాసరి మధు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి శ్రీనివాసరా వు, పీడీలు శ్యామయ్య, రాజేందర్, వినోద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం



చేగుంట, డిసెంబర్ 19: చేగుంటకు చెందిన ఎండీ మౌలానా మనుమరాలి పెండ్లి కోసం రూ.5 వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యాన్ని సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో చేగుంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, మురాడి రవి, ఎండి నజీర్, షాదుల్లా, గుండబోయిన సురేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీవాలికి రెండో స్థానం



చిన్నశంకరంపేట, డిసెంబర్ 19: మెదక్‌లో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో జూనియర్ బాలికల విభాగంలో చిన్నశంకరంపేట మోడల్ పాఠశాల విద్యార్థిని శ్రీవల్లి రెండో స్థానంలో నిలిచింది. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట విద్యార్థులు ఎంపిక



గాయత్రి, అంకిత

చేగుంట, డిసెంబర్ 19: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట జడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థినులు గాయత్రి, అంకిత ఎంపికైనట్లు ఎంఈవో నీరజ, పీఈటీ శారద తెలిపారు. మెదక్‌లో జరిగిన క్రీడా పోటీల్లో చేగుంట విద్యార్థులు 200 మీటర్ల రన్నింగ్‌లో గాయత్రి మొదటి స్థానం, 800 మీటర్ల రన్నింగ్‌లో అంకిత రెండో స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడకారులను పాఠశాల ఉపాధ్యాయులు అభినంధించారు.

### దుర్గా రైస్‌మిల్లులో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ దాడులు



పీడీఎస్ బియ్యం లారీతో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

నిజాంపేట, డిసెంబర్ 19: మండలంలోని నందిగామ దుర్గా రైస్‌మిల్లులో స్టేట్ సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ద్రోణచార్యులు, సివిల్ సప్లై ఎమ్మార్వో ప్రభాకర్ మాట్లాడుతూ దుర్గారైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వ చేసి ఉంచారనే సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో 246 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైందన్నారు. పీడీఎస్ బియ్యం తరలించినా, నిల్వ చేసినా ఆ వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐలు ప్రీతి, ఇమాద్, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

### కారు ఢీకొని బాలుడికి తీవ్రగాయాలు

వెల్దుర్తి, డిసెంబర్ 19: రోడ్డు దాటి వెళ్తున్న బాలుడిని కారు ఢీకొని తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని యశ్వంతరావుపేట చౌరస్తా వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన బ్యాగరి శ్రీనివాస్ కుమారుడు వంశీ, మంగళపర్తి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజులాగే పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతున్నాడు. నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వస్తున్న మారుతీ ఈకో కారు వేగంగా వచ్చి విద్యార్థిని ఢీకొట్టింది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని వెల్దుర్తిలోని ప్రైవేటు దవాఖానకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలుడిని హైదారాబాద్‌కు తరలించారు. ఈకో వాహనాన్ని వెల్దుర్తి శివారులో గుర్తించారు. గ్రామస్తులు కారును, డ్రైవర్‌ను పట్టుకుని వెల్దుర్తి పోలీసులకు అప్పగించారు.

## పది ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలి
- 10/10 సాధించేందుకు విద్యార్థులు కష్టపడాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేందుకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేసి అమలుపర్చాలని స్టూడెంట్ వైస్ డిటెయిల్స్ తీసుకుని తయారు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉత్తమ ఉద్యోగులుగా స్థిరపడిన వారి పేర్లు, ఫొటోలను పాఠశాలల్లో ఉంచినట్లయితే వారిని ఆదర్శంగా తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థి ఇంగ్లిష్ మాట్లాడడంపై మక్కువ చూపించేలా చర్యలు చేపట్టాలన్నారు. డ్రాప్ అవుట్ తగ్గించాలని, చైల్డ్ మ్యారేజెస్ అరికట్టాలని, వీటిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ నెల చివరి వరకు పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈవో రాధాకృష్ణ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి, ఎంఈఓలు పాల్గొన్నారు.



కొల్చారం: గురుకులంలో వంటలు పరిశీలిస్తున్న కలెక్టర్

### మెనూ అమలులో అలసత్వం వద్దు

కొల్చారం, డిసెంబర్ 19: నూతన మెనూ అమలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ నగేశ్ వేర్వేరుగా తనిఖీ చేశారు. వంటగదిని సందర్శించి విద్యార్థులకు వండిన వంటకాలను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో పర్యటించి వంటగది, వంట పాత్రలు, కూరగాయల నిల్వ గదుల శుభ్రత, డార్మెటరీ గదులు, తరగతి గదులు, మరుగుదొడ్ల శుభ్రతను తనిఖీ చేశారు. వంట మాస్టర్లకు నూతన మెనూ తయారీ విధానంలో అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గఫర్ మియా, ఆర్ఐ ప్రభాకర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: డీఎల్‌పీవో

చిన్నశంకరంపేట, డిసెంబర్ 19: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు ఆదేశించారు. గురువారం మండలంలోని మిర్జాపల్లి జడ్పీ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. పైపులైన్ లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

వెల్దుర్తి, డిసెంబర్ 19: గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దీంతో నేరాలు, చోరీలు అదుపు చేయవచ్చని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నేను సైతం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌లు, వైన్స్‌లు, కల్లుదుకాణాలు, ఫంక్షన్ హాళ్లు, రైస్‌మిల్లులు, ఇతర వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అక్రమ ఇసుక, మట్టి రవాణాపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల విషయంలో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

### శివ్వంపేటలో రికార్డుల పరిశీలన

శివ్వంపేట, డిసెంబర్ 19: శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. మిస్సింగ్ కేసులు, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సీసీ కెమెరాల పనితీరును మరింత మెరుగు పర్చుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఎస్పీ వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి, తూప్రాన్ ఎస్సై సదానందం పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలతో నిందితులను సులువుగా గుర్తించవచ్చు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 19: సీసీ కెమెరాలతో నిందితులను సులువుగా గుర్తించవచ్చని ఎస్పీ తెలిపారు. చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఆయన వెంట రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్సై నారాయణ ఉన్నారు.

## రాజ్యాంగ నిర్మాతను అవమాన పర్చడం సరికాదు



కొల్చారం: రంగంపేటలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రామాయంపేట, డిసెంబర్ 19: పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించడం బీజేపీకే చెల్లిందని, కేంద్ర హోంశాఖ మంత్రి అన్న మాటలు వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దూరి శివరాం మాదిగ హెచ్చరించారు. గురువారం రామాయంపేటలో మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం మూలంగానే దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లు వచ్చాయన్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, డిసెంబర్ 19: జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండల ఎస్సీ మాలసంఘం నాయకులను ఎస్సై మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాలమహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులు చేపట్టడం హేయమైన చర్య అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపవద్దని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. బీఆర్‌స్ పార్టీ అధ్యక్షుడు బుచ్చయ్య, మాజీ ఎస్ఎంసీ నర్సింలు, కిష్టయ్య, బాలయ్య పాల్గొన్నారు.

### కొల్చారంలో..

కొల్చారం, డిసెంబర్ 19: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రంగంపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద మెదక్ సంగారెడ్డి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్, మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి ఆకుల పెంటయ్య, బీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు యోహన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిఎర్రోళ్ల సంజీవయ్య, సుల్తాన్నగారి కృష్ణ, జైపాల్, దుర్గయ్య, బాబయ్య, మహేశ్ పాల్గొన్నారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 19: మండలంలోని మాల మహానాడు సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తామన్న మాల మహానాడు నాయకులను ముందస్తు అరెస్టు చేసిన ఏఎస్సై మిస్బోద్దీన్ పోలీస్‌స్టేషన్ తరలించారు. వారిలో మండలం మాల మహానాడు అధ్యక్షుడు బాల్‌రాజ్, మండల కార్యదర్శి సత్యం పోలీసులు అరెస్టు చేశారు.

### చేగుంటలో..

చేగుంట, డిసెంబర్ 19: చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో దళిత వికలాంగుల ఫోరం మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఎగ్గడి శేఖర్, మాసాయిపేట మండల అధ్యక్షుడు గుర్రం ప్రకాశ్‌ను చేగుంట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### కోనాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే



కోనాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే

రామాయంపేట, డిసెంబర్ 19: మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి గురువారం చేపట్టారు. ఇందిరమ్మ కమిటీతో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఇండ్ల సర్వేను తొందరగా పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఆమె వెంట కమిటీ సభ్యులు మామిడి సిద్ధరాములు, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

### యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



వెంకటస్వామి

వెల్దుర్తి, డిసెంబర్ 19: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 24న మెదక్ టీఎన్‌జీవో భవన్‌లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా అక్బర్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా ఆనంద్‌కుమార్ తదితరులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

### బాధిత కుటుంబానికి మాజీ జడ్పీటీసీ ఆర్థిక సాయం



శివ్వంపేట, డిసెంబర్ 19: చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన షేక్ రహీం కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

### బోనాల్‌లో మహిళ అదృశ్యం



నాగరాణి

చేగుంట, డిసెంబర్ 19: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని బోనాల్ గ్రామంలో చోటు చేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బోనాల్ గ్రామానికి చెందిన పులబోయిన నాగరాణికి పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాగరాణి భర్త రమేశ్ మూడు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తన ఇద్దరు కొడుకులతో కలిసి తల్లిగారి ఊరు బోనాల్‌లో నివసిస్తున్నది. ఇంట్లో పిల్లలకు సంబంధించి ఈ నెల 18న తల్లి శశికళతో గొడవ పడింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోయింది. అనంతరం బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా నాగరాణి ఆచూకీ దొరకలేదు. దీంతో తల్లి శశికళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శశికళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నాగరాణి సమాచారం ఎవరికైనా తెలిస్తే చేగుంట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.